

.. చిరుత సంచారం

తానూరు మండలం బెంబర గ్రామంలో వారంలోపు రెండు లేగదూడలను చిరుత చంపి తిన్నది. బెంబరతోపాటు సమీప గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. 8లో▸



మహాగాంలో కుస్తీ పోటీలు

భైంసా మండలం మహాగాంలో మహాదేవుని జాతరలో భాగంగా కుస్తీ పోటీలు నిర్వహించారు. సరిహద్దు గ్రామాలకు చెందిన మల్లయోధులు పోటీలో తలపడ్డారు. 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
38.0 /26.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం పాక్షికంగా, పలుచోట్ల పూర్తిగా మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశముంది.

టచ్‌లో ఉంటున్నారు!

- ఎంపీ ఎన్నికల్లో పోటాపోటీ
- అరచేతిలోకి పార్టీల ప్రచారం
- అభ్యర్థుల పేరిట 'గ్రూపులు'
- సోషల్ మీడియాలో పోస్టులు
- వెంటనే కార్యక్రమాల అప్‌డేట్

నిర్మల్: కొన్నివారాలుగా.. స్మార్ట్‌ఫోన్‌ను టచ్ చేస్తే చాలు 'హలో నేను ఫలానా పార్టీ అభ్యర్థిని. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న. ఓటేసి నన్ను గెలిపించండి..' అంటూ కాల్స్ వస్తున్నాయి. ఏ సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్ చూసినా పొలిటికల్ పోస్టులతో హోరెత్తుతోంది. ప్రతి ఐదేళ్లకూ ప్రచార తీరు మారిపోతూనే ఉంది. ఈసారి పార్లమెంట్ పోరు మరింత 'స్మార్ట్'గా సాగిపోతోంది. ఓటరు తన ఫోన్ టచ్ చేస్తే చాలు.. తమ ప్రచారమే ఉండేలా పార్టీలు, అభ్యర్థులు పోటీపడుతున్నారు.

క్షణాల్లో వేలాదిమందికి చేరేలా..

సపరేట్‌గా వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసి మరీ.. తమ ప్రచార పోస్టులు పెడుతున్నారు. తమ అభ్యర్థికి సంబంధించిన ప్రతీ కార్యక్రమ అప్‌డేట్‌ను ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు వెంటవెంటనే పోస్టు చేస్తున్నారు. క్షణాల్లోనే వేలాదిమందికి చేరేలా చూస్తున్నారు. ఇందుకు ప్రత్యేకంగా ఆయా పార్టీల అభ్యర్థులు డిజిటల్ ప్రచార టీమ్‌లను ఏర్పాటు చేసుకుంటున్నారు. జనం చూపు ఎక్కడ ఉంటుందో.. అక్కడే తమ ప్రచారాన్ని పెంచుకుంటూ ముందుకుసాగుతున్నారు.

తగ్గిన గోడరాతలు

ఎన్నికలంటే ఒకప్పుడు తెల్లటి గోడలపై నీలిరంగులో రాతలు ప్రత్యక్షమయ్యేవి. అభ్యర్థుల ఫొటో ఉన్న పోస్టర్లు.. బ్యానర్ల ద్వారానే ప్రచారం సాగేది. పగలు, రాత్రి తేడా లేకుండా మైకులు పెట్టి వాహనాలు తిప్పేవారు. దారి పొడవునా బ్యానర్లు, పార్టీల జెండాలను తోరణాల్లాగా కట్టేవారు. ఇప్పుడా సీన్ మారిపోతూ వస్తోంది. 'స్మార్ట్' ప్రచారం తెరపైకి వచ్చాక.. సంప్రదాయ ప్రచారాన్ని తగ్గిస్తున్నారు. నాలుగునెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తేనే.. ఇప్పటి పార్లమెంట్ ఎన్నికల్లో గోడరాతలు నామమాత్రంగా కనిపిస్తున్నాయి. పార్టీల బ్యానర్లు, జెండాలు, పోస్టర్ల జాడే లేదు.



ఫేస్‌బుక్‌లో బీజేపీకి మద్దతుగా ప్రచారం



వాట్సప్‌లో కాంగ్రెస్‌కు మద్దతుగా స్టేటస్

'గ్రూపులు' పెట్టి..

ప్రధానంగా ఫేస్‌బుక్, వాట్సప్, ఎక్స్ (ట్విట్టర్), యూట్యూబ్ ద్వారా పార్లమెంట్ ఎన్నికల ప్రచారం వేగంగా సాగుతోంది. ఎన్నికల వేళ మరిన్ని ప్రత్యేక గ్రూపులు ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆదిలాబాద్, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థుల పేరిట గ్రూపులు ఏర్పాటు చేసుకున్నారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ప్రత్యేకంగా తమ కార్యకర్తలు, నాయకులు, ఫాలోవర్లతో వాట్సప్ గ్రూపులు, ఫేస్‌బుక్ పేజీలు క్రియేట్ చేశాయి. ఆయా గ్రూపుల్లోని సభ్యులు, అభిమానులు తమకు వచ్చిన సమాచారం, ప్రచార ఫొటోలను మరింతమంది, ఇతర గ్రూపులకు పంపించాలని సూచిస్తున్నాయి.

తగ్గిన బహిరంగ సభలు

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

ఎన్నికలంటే ఒకప్పుడు భారీ బహిరంగ సభలు, కార్నర్ మీటింగ్‌లు, గల్లీల్లో సమావేశాలు ఉండేవి. క్రమంగా అవన్నీ తగ్గుతున్నాయి. ఎన్నికల కమిషన్ ప్రతీ కార్యక్రమానికి లెక్క చెప్పాలని పక్కాగా నిబంధనలు పెట్టడమూ ఇందుకు ఓ కారణమే. పార్టీల ప్రచారంపైనా నిఘా కొనసాగుతోంది. ఈక్రమంలో పార్టీలు, అభ్యర్థులు కొంత ఇబ్బందికరంగానే బహిరంగ ప్రచారం చేసుకోవాల్సి వస్తోంది. సభలు, సమావేశాలు నిర్వహించాలంటే ఖర్చులు కూడా ఎక్కువే. జన సమీకరణ ప్రధాన సమస్యగా మారింది. అదే.. సోషల్ మీడియా ద్వారా ఎలాంటి ఇబ్బంది లేకుండా తాము చెప్పదల్చుకున్నది నేరుగా ఓటరుకు చెప్పొచ్చు. స్మార్ట్ ఫోన్‌ల వినియోగం పెరగడంతో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు డిజిటల్ ప్రచారానికే ప్రాధాన్యం పెంచుతున్నాయి. ఇందుకోసం ప్రత్యేకంగా ఐటీ విభాగాలు, సోషల్ మీడియా ఇన్‌చార్జిలను నియమించుకున్నాయి. ఇక ఒక్కోసారి డిజిటల్ వేదికలపై ప్రచారం హద్దులు దాటుతుండటమూ గమనార్హం. ఎన్నికల సంఘం వీటిపైనా నిఘా పెట్టింది. ఇందులోనూ హద్దులు దాటితే కేసులు నమోదు చేస్తోంది.

ఓటరు చూపు పట్టేస్తూ..

ఒకప్పుడు ఓటరునాడీ పట్టి ప్రచారం చేయాలనేవారు. ఇప్పుడు జనం చూపు ఎక్కడుందో అక్కడే పబ్లిసిటీ చేసుకుంటున్నారు. ప్రతీ ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉండటంతో అభ్యర్థులకు ప్రచారం చాలా సులువైపోయింది. తమ అభ్యర్థికి మద్దతివ్వాలని పెద్ద పార్టీలు కూడా సింపుల్‌గా సోషల్ మీడియా ద్వారా మెసేజ్‌లు పంపుతున్నాయి. అభ్యర్థుల ప్రచారం, ముందస్తు సమాచారాన్ని అందుబాటులో ఉంచుతున్నాయి. గత లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే.. ఈసారి ప్రచారం ఫేస్‌బుక్, వాట్సప్, ఎక్స్, యూట్యూబ్‌ను దాటి ఇన్‌స్టాగామ్ వరకూ జోరుగా దూసుకుపోయింది. ఏ ప్లాట్‌ఫామ్‌నూ వదలకుండా పార్టీలు, అభ్యర్థులు తమ కార్యక్రమాలు షేర్ చేస్తున్నారు. నిత్యం ఆసక్తికరంగా ఉండేలా తమ ప్రచారాన్ని రూపొందించుకుంటున్నారు. తమ ప్రచారంతోపాటు ప్రత్యర్థులపై కౌంటర్లనూ వెంటవెంటనే ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.

న్యూస్‌రీల్

కాంగ్రెస్‌లోకి కడెం జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి



శ్రీనివాస్‌రెడ్డికి కండువా వేస్తున్న ఎమ్మెల్యే

కడెం: కడెం జెడ్పీటీసీ సభ్యుడు పురపాటి శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీపూర్ మాజీ సర్పంచ్ విజయ, రాజన్న కాంగ్రెస్‌లో చేరారు. ఆదివారం ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ వీరికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మల్లేశ్, మాజీ మండలాధ్యక్షుడు గొల్ల వెంకటేశ్, భూషణ్, రాజేశ్వర్‌రెడ్డి, లచ్చన్న తదితరులున్నారు.

గజ్జలమ్మదేవికి పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: మండల కేంద్రంలోని గజ్జలమ్మదేవి ఆలయంలో ఆదివారం గురుస్వామి గజేందర్, అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మీ అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ, పల్లకీసేవ నిర్వహించారు. మహారాష్ట్రలోని ముంబై, నాందేడ్, బోకర్, ధర్మాబాద్, ఇస్లాపూర్, శివుని ప్రాంతాల నుంచి కూడా భక్తులు అధికసంఖ్యలో వచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. పలువురు ఎత్తు బంగారం (బెల్లం), తలనీలాలు ఇచ్చి మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

నేడు ఆదిలాబాద్‌కు సీఎం రాక



డైట్ కళాశాల మైదానంలో సభావేదిక

కైలాస్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి రానున్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి హాజరవుతున్నారు. ఈ మేరకు పార్టీ శ్రేణులతోపాటు జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఉదయం 9.45గంటలకు హైదరాబాద్ బేగంపేట నుంచి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో బయలుదేరి 11గంటలకు ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం గుండా ప్రభుత్వ డైట్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బహిరంగ సభాస్థలికి చేరుకుంటారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. పలువురు మంత్రులతో పాటు పార్లమెంట్ పరిధిలోని ముఖ్య నాయకులంతా హాజరు కానున్న కార్యక్రమానికి భారీ వేదిక సిద్ధం చేస్తున్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా సభకు హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు పోలీసులు పట్టణంలోని పలు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సభకు హాజరయ్యే ముఖ్య నాయకులతో పాటు ప్రజలను తీసుకువచ్చిన వాహనాలను పార్కింగ్ చేసేందుకు ఇప్పటికే ప్రత్యేక స్థలాలు గుర్తించారు. సభ ఏర్పాట్లను కాంగ్రెస్ నాయకులు ఆదివారం పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. పోలీసులు ఇప్పటికే సభా ప్రాంగణాన్ని తమ అధీనంలోకి తీసుకుని తనిఖీ చేస్తున్నారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీజీ నరసింహారావు కోరారు. పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాకేంద్రంలోని హీరా ఫంక్షన్‌హాల్‌లో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డీ నూతన్‌కుమార్ అధ్యక్షతన ఎన్నికల బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ.. వ్యవసాయ కార్మికులు, రైతులు, కార్మికులు, కౌలు రైతులకు మేలు జరగాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో వామపక్ష అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.అడివయ్య మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్న బీజేపీని ఓడించి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి గౌతమ్‌కృష్ణ, నాయకులు బొమ్మెన సురేశ్, సుజాత, డాకూర్ తిరుపతి, తొడసం శంభు, ఇప్ప లక్షణ్, ఫసియొద్దీన్, నాగేలి, నర్సయ్య, పోశెట్టి, వెస్లీ, నవీన్, ముత్తన్న తదితరులు పాల్గొన్నారు.

జనరల్ నుంచి రిజర్వ్‌డ్



- ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్వరూపం మారిందిలా..
- హైదరాబాద్ రాష్ట్రం నుంచి ప్రత్యేక తెలంగాణ వరకు..
- జనరల్ స్థానంగా 15 సార్లు ఎన్నికలు
- 2009 నుంచి ఎస్టీ రిజర్వ్‌డ్‌గా మార్పు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రత్యేకతను కలిగి ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటుకు ముందుగానే ఆవిర్భవించిన ఈ నియోజకవర్గం ప్రస్తుతం రాష్ట్రంలో తొలి నియోజకవర్గంగా గుర్తింపు కలిగి ఉంది. హైదరాబాద్ రాష్ట్రం మొదలు 2019 వరకు ఒక ఉప ఎన్నికతోపాటు 17 సార్లు సాధారణ ఎన్నికలు జరిగాయి. జనరల్‌గా ప్రారంభమైన ఈ స్థానం ప్రస్తుతం ఎస్టీ రిజర్వ్‌డ్‌గా కొనసాగుతోంది. జిల్లాల పునర్విభజన వరకు ఉమ్మడి ఆదిలాబాద్‌లోనే ఉండగా ప్రస్తుతం మూడు జిల్లాల పరిధిలోకి మారింది.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

2009లో ఎస్టీ రిజర్వ్‌డ్‌గా రూపాంతరం

జనరల్ స్థానంగా 14 సాధారణ ఎన్నికలతో పాటు ఒక ఉప ఎన్నిక జరిగిన ఈ నియోజకవర్గం పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గంగా రూపాంతరం చెందింది. ఆ ఏడాది జరిగిన తొలి ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన రాథోడ్ రమేశ్ కాంగ్రెస్ అభ్యర్థి కోట్నాక్ రమేశ్‌పై 1,15,087 ఓట్ల అధిక్యంతో విజయం సాధించి తొలిసారిగా పార్లమెంట్‌లో అడుగు పెట్టారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం రెండు సార్లు ఎన్నికలు జరిగాయి. 2014లో బీఆర్‌ఎస్ అభ్యర్థి గోడం నగేశ్ విజయం సాధించగా 2019లో సోయం బాపూరావు బీజేపీ తరఫున ఎంపీగా గెలుపొందారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో గోడం నగేశ్ బీజేపీ తరఫున మరోసారి ఎన్నికల బరిలో నిలువగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ తరఫున కొత్త అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.

మూడు జిల్లాల పరిధిలో నియోజకవర్గం

2016లో జిల్లాల పునర్విభజనతో పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికలను ఎదుర్కోవడం రాజకీయ పార్టీలకు సవాల్‌గా మారింది. అప్పటి వరకు ఉన్న పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు మారనప్పటికీ అవి కొత్తగా ఏర్పడ్డ జిల్లాలతో మూడు జిల్లాల పరిధిలోకి మారాయి. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలు ఆదిలాబాద్ జిల్లా పరిధిలో, ఆసిఫాబాద్, సిర్పూర్ .. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోకి వెళ్లాయి. ఇక నిర్మల్, ముథోల్, ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలు నిర్మల్ జిల్లా పరిధిలో ఉన్నాయి.

ఎన్నికల నిర్వహణ సవాలే..

ఈ స్థానానికి సంబంధించి ఎన్నికలు అటు రాజకీయ పార్టీలతో పాటు ఇటు అధికారులకు సవాలుగానే మారాయి. బాధ్యతలు సమన్వయం చేసుకోవడం రాజకీయ పార్టీల నేతలకు పెద్ద టాస్కే. అయితే అధికార పార్టీకి కొంత అడ్వంటేజ్‌గా ఉంటుండగా ప్రతిపక్ష పార్టీలకు ఆయా జిల్లాలోని శ్రేణులను సమన్వయం చేసుకోవడం, సభలు, సమావేశాలు, ప్రచార నిర్వహణ కొంత ఇబ్బందికరమే. ఇక యంత్రాంగం పరంగా చూస్తే మూడు జిల్లాల కలెక్టర్లు ఎన్నికల నిర్వహణను పర్యవేక్షించాల్సి వస్తోంది. ఆయా జిల్లాల ఓటర్ల జాబితా నుంచి పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల నిర్వహణ వరకు అధికారులను సమన్వయం చేసుకోవాల్సిందే.

స్వరూపం మారిందిలా...

1952లో ఆవిర్భవించిన ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి హైదరాబాద్ రాష్ట్రంగా ఉన్న సమయంలో తొలిసారిగా ఎన్నికలు జరిగాయి. ఆ సమయంలో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, సిర్పూర్, మంచిర్యాల నియోజకవర్గాలు ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోనే ఉన్నాయి.

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 1957లో జరిగిన రెండో ఎన్నికలతో పార్లమెంట్ నియోజకవర్గ స్వరూపం తొలిసారిగా కొంత మారింది. ఆ ఐదు నియోజకవర్గాలకు అదనంగా మరో రెండు నిర్మల్, ముథోల్ చేరాయి.
- 1962లో జరిగిన ఎన్నికల్లో బోథ్ నియోజకవర్గం కొత్తగా చేరింది.
- 1978లో నూతనంగా ఏర్పడ్డ ఖానాపూర్‌ను ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కలుపగా అప్పటి వరకు దీని పరిధిలో ఉన్న మంచిర్యాలను పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో విలీనం చేశారు.
- అప్పటి నుంచి జిల్లాల పునర్విభజన వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏడు నియోజకవర్గాలతో కూడిన పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికలు జరుగుతూ వచ్చాయి.

పదేళ్లలో బీజేపీ చేసింది శూన్యం

- కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క
- బాసర, ముథోల్, తానూరు మండలాల్లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం



ముథోల్: మండల కేంద్రంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పక్కన అభ్యర్థి సుగుణ, మాజీ ఎమ్మెల్యేలు

భైంసా/ముథోల్/తానూరు: పదేళ్లలో రాష్ట్రానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేసిందేమీలేదని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఆరోపించారు. ఆదివారం బాసర మండలంలోని బాసర, బిద్రెల్లి గ్రామాలు, ముథోల్ మండల కేంద్రం, తానూరు మండలం సింగన్‌గాం, జౌలా(బీ) గ్రామాల్లో పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తానూరు మండలం సింగన్‌గాం గ్రామంలో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. గ్రామంలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి రూ.3 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పంచరంగి జెండా ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బాసరకు కేంద్ర విశ్వవిద్యాలయాన్ని ఇస్తానని మరిచిపోయిందని విమర్శించారు. నిర్మల్, బోథ్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో ఇప్పటికీ రైలుమార్గం ఏర్పాటు చేయలేదన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని, కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి సాధ్యమని చెప్పారు. కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలో వచ్చాక సంక్షేమ పథకాలు, ఆరుగ్యారంటీలు అమలు చేస్తోందని, రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తోందని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ 14 స్థానాల్లో గెలిచితీరుతుందని ధీమా వ్యక్తంజేశారు. ఎంపీ అభ్యర్థి సుగుణ మాట్లాడుతూ.. ఆదివాసీ బిడ్డనైన తనను ఆదరించి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తాను గెలిచాక నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధికి పాటుపడతానని హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యేలు బోస్లే నారాయణరావుపటేల్, గడ్డిగారి విఠల్‌రెడ్డి, రేఖానాయక్, నాయకులు వెంకటేశ్‌గౌడ్, లక్ష్మణ్‌రావు, సుధాకర్‌రెడ్డి, ఫుండలిక్, గోవింద్‌రావ్ పటేల్, మధు పటేల్, సదాశివ్ పటేల్, మాధవ్‌రావ్ పటేల్, శంకర్ చంద్రే, బాశెట్టి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వి మోసపూరిత హామీలు

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

భైంసాటౌన్: మోసపూరిత హామీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు. పట్టణంలోని ఎస్‌ఎస్ కాటన్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. డిసెంబర్ 9న రూ.2లక్షల రుణమాఫీ చేస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డి మాట మార్చి ఆగస్టులో అమలు చేస్తామనడం రైతులను మోసగించడమేనని విమర్శించారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌కు మనుగడ లేదని, జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడుతున్నారని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమని, ప్రచారంలో ప్రజల నుంచి వస్తున్న స్పందనే ఇందుకు నిదర్శనమని చెప్పారు. మోదీని మూడోసారి ప్రధాని చేయాలని ప్రజలే సంకల్పించారని, ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని భారీ మెజార్టీతో గెలిపించి ప్రధానికి కానుకగా ఇస్తారని పేర్కొన్నారు. ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ ఈనెల 24న నామినేషన్ వేయనున్నారని, ఉదయం 11 గంటలకు నామినేషన్ ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్, పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, ఎంపీపీ అబ్దుల్ రజాక్, పట్టణాధ్యక్షులు మల్లేశ్వర్, సాప్లి రమేశ్ తదితరులున్నారు.

ఘనంగా వీరహనుమాన్ విజయయాత్ర



కొనసాగుతున్న విజయయాత్ర



నృత్యం చేస్తున్న గుస్సాడీలు

మార్మోగిన జైశ్రీరాం, జై హన్మాన్ నినాదాలు

నిర్మల్‌టౌన్: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో ఆదివారం వీరహనుమాన్ విజయయాత్రను ఘనంగా నిర్వహించారు. విజయయాత్రను భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ప్రారంభించగా వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. వీధులన్నీ కాషాయ వర్ణంలోకి మారాయి. దారి పొడవునా జై శ్రీరామ్.. జై హనుమాన్ నినాదాలు మార్మోగాయి. విజయయాత్రలో గుస్సాడీలు చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కాషాయ జెండా చేతబట్టుకుని విజయయాత్రలో యువకులను ఉత్సాహపరిచారు. సుమారు ఐదు కిలోమీటర్ల మేరకు యాత్ర కొనసాగింది. పలు స్వచ్ఛంద సంస్థలవారు భక్తులకు జ్యూస్, వాటర్ బాటిళ్లు అందజేశారు. డీఎస్పీ గంగారెడ్డి, పట్టణ, రూరల్ సీఐలు అనిల్, నవీన్‌కుమార్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ట్రాఫిక్ అంతరాయమేర్పడకుండా, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భారీ బందోబస్తు నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, నాయకులు ముత్యంరెడ్డి, దేవరకోట ఆలయ చైర్మన్ ఆమెడ శ్రీధర్, నాయకులు పూదరి రంజిత్, డాక్టర్ ప్రమోద్‌చంద్రారెడ్డి, పలువురు కౌన్సిలర్లు, ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్, హిందూవాహిని, భజరంగ్ దళ్ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు సమన్యాయం

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు
- కాంగ్రెస్‌లో పులువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరినవారితో శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు సమన్యాయం సాధ్యమని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో లక్ష్మణచాంద మాజీ సర్పంచ్ బిట్లింగు నారాయణ, ఆరోవార్డు తాజా మాజీ వార్డు సభ్యుడు మంగళంపల్లి గణేశ్, పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి శ్రీహరిరావు పార్టీ కండువాలు వేసి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రానికి జరిగిన నష్టం గత 70 ఏళ్లలోనూ జరగలేదని ఆరోపించారు. కేసీఆర్ అహంకార ధోరణి కారణంగానే ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేశారని తెలిపారు. ఆదిలాబాద్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ లక్ష్మణచాంద మండలాధ్యక్షుడు ఓడ్నాల రాజేశ్వర్, నాయకులు ఈటల శ్రీనివాస్, అట్ల రామ్‌రెడ్డి, అట్ల రవీందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నరేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహాగాంలో కుస్తీ పోటీలు



కుస్తీలో తలపడుతున్న మల్లయోధులు

భైంసారూరల్: మండలంలోని మహాగాం గ్రామంలో మహాదేవుని జాతరలో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కుస్తీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో సరిహద్దు మహారాష్ట్ర ప్రాంతం నుంచి మల్లయోధులు పాల్గొన్నారు. జాతర సందర్భంగా త్రియంబకేశ్వర ఆలయంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద ఆటబొమ్మలు, మిఠాయిలు, గాజులు విక్రయించే దుకాణాలు వెలిశాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాదిగా జాతరకు తరలివచ్చారు.

విద్యార్థి అదృశ్యం



సాయిగణేశ్ (ఫైల్)

తానూరు: భోసి గ్రామానికి చెందిన విద్యార్థి మారుకొండ సాయిగణేశ్ (16) అదృశ్యమైనట్లు ఫిర్యాదు రాగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సాయిగణేశ్ స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 20వ తేదీన పరీక్ష రాసి ఇంటికి వచ్చాడు. మధ్యాహ్నం తర్వాత ఆడుకునేందుకు బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం అతడి తండ్రి కిషన్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డంప్‌యార్డులో అగ్ని ప్రమాదం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్‌లో గల మున్సిపాలిటీ డంప్‌యార్డులో ఆదివారం ప్రమాదశాత్తు మంటలు లేచాయి. స్థానికులు వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా ఘటనాస్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పేశారు. సకాలంలో మంటలు ఆర్పడంతో సమీప నివాసాలవారు ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడ్డ సందీప్

బజార్‌హత్నూర్: మండలంలోని చందునాయక్‌తండా జీపీ పరిధి మహదేవ్‌నగర్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని హిమయత్‌నగర్‌కు చెందిన సందీప్, మారుతి, అజీష్ ఒకే బైక్‌పై మండలంలోని భూతాయి గ్రామంలో ఓ వివాహ వేడుకకు హాజరయ్యేందుకు వస్తున్నారు. మహదేవ్‌నగర్ వద్ద రోడ్డుపై గుంతను తప్పించబోయి అదుపుతప్పి కింద పడిపోయారు. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మూగజీవుల నేస్తాలు!

నిర్మల్‌ఖిల్లా: జిల్లాలో ఉష్ణతాపం రోజురోజుకూ పెరుగుతోంది. మనుషులతోపాటు పశుపక్షాదులు సైతం అల్లాడిపోతున్నాయి. మనుషులే దాహార్తి తట్టుకోలేక చలివేంద్రాలకు, శీతలపానీయాల తాగుతూ ఉపశమనం పొందుతున్నారు. ఎక్కడికి వెళ్తున్నా వాటర్ బాటిల్ వెంట తీసుకెళ్తున్నారు. ఇలాంటి ఎండల తీవ్రతకు పక్షుల పరిస్థితి ఎలా ఉంటుంది..? ఇదే అంశాన్ని ఆలోచించిన జిల్లా వాసులు, మూగ జీవుల ప్రేమికులు పక్షుల కోసం బర్డ్ ఫీడర్, వాటర్ ఫీడర్స్ వంటివి ఏర్పాటు చేస్తూ మూగ జీవుల సంరక్షణకు మేముసైతం అంటున్నారు. ప్రకృతి సంరక్షణలో పక్షులపాత్ర కీలకం అలాంటి పక్షులను కాపాడుకునేందుకు మమవంతు బాధ్యతగా కొంత సమయాన్ని, కొంత డబ్బును వాటి కోసం ఖర్చు చేస్తున్నారు. నీళ్లు, ధాన్యం గింజలు అందిస్తున్నారు. ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్న జంతు ప్రేమికులపై ప్రత్యేక కథనం..

- దాహం తీరుస్తూ.. ఆహారం అందిస్తూ..
- మండుటెండకు నీరసిస్తున్న పక్షులకు సాంత్వన
- సంరక్షణకు మేము సైతం అంటున్న నిర్మల్ జిల్లావాసులు

ఒకప్పుడు ఇలా..

గతంలో పల్లె, పట్టణం అంటూ తేడా లేకుండా ఇంటి గుమ్మాలు, ఇంటి ఆవరణలోని మొక్కలు, చెట్లు, వీధులన్నీ పక్షుల కిలకిలరావాలూ, పిచ్చుకల కిచకిచ శబ్దాలతో కళకళలాడిపోయేవి. వీటి కోసం ఇంటి చూర్లకు మొక్కజొన్న, సజ్జలు, జొన్నలు వంటి ధాన్యపుగింజల కంకులను వేలాడదీసేవారు. కొబ్బరి లేదా మట్టి చిప్పల్లో నీళ్లు పెట్టి పక్షులకు దాహార్తిని తీర్చేవారు. నిత్యం ఈ పక్షులు చేసే సందడిని చూసి చిన్న పిల్లలు, పెద్దలు మైమరిచిపోయేవారు. ఇళ్ల ఆవరణలోని చెట్లపై, చేదబావుల్లో గూళ్లు కట్టుకునేవి. గుంపులు గుంపులుగా చేలలో సంచరించే పక్షులు పిచ్చుకలు ప్రస్తుతం అరుదుగా దర్శనమిస్తున్నాయి. పంటచేలపై విపరీతమైన పురుగుమందులు వాడకం, సెల్‌ఫోన్ టవర్ల రేడియేషన్ తీవ్రత,



జిల్లాకేంద్రంలోని ఓ ఇంటిలో పక్షుల కోసం రేకుడబ్బాలతో ఏర్పాటు చేసిన ధాన్యపు ఫీడర్లు (ఫైల్)

విపరీతమైన ఉష్ణోగ్రతలకు పక్షుల మనుగడ ప్రశ్నార్థకం అవుతోంది. ఈ నేపథ్యంలో పక్షుల కోసం రోజుకు కొంత సమయం కేటాయించి ధాన్యపు గింజలు, నీటిని అందించడం ద్వారా పక్షుల మనుగడకు మన వంతు తోడ్పాటు అందించవచ్చు.

ప్రకృతితోనే జీవనం..

భారతీయ జీవన విధానం ప్రకృతితో ముడిపడి ఉంది. ప్రకృతిలో పక్షుల పాత్ర కీలకం. అభివృద్ధిలో పంట పొలాల్లో పురుగులను ఏరి తినేసి దిగుబడిలో తోడ్పడుతుంది. జంతువుల కళేబరాలను తిని వాతావరణ కాలుష్యం తగ్గించడంలో తోడ్పడుతాయి. అదేవిధంగా మొక్కలు పుష్పాలలో పరపరాగ సంపర్కం, ఔషధాలు వంటి వాటిలో పక్షులు ఉపయోగపడుతున్నాయి. అడవుల నరికివేత, వేట, జల, వాయు, శబ్ద కాలుష్యాలు, మృత్తికల కాలుష్యం, మితిమీరిన రేడియేషన్ వంటి ప్రభావాలతో పక్షులు అంతరించిపోతున్నాయి. ప్రకృతిలో ప్రతీజీవికి జీవించే హక్కు ఉంటుంది. అన్ని రకాల జీవుల సమన్వయంతోనే ప్రకృతి ఆహ్లాదభరితంగా సాగుతుంది. ప్రస్తుతం మనం చేసే పనులతో చాలా రకాల పక్షులు అంతరించిపోయే దశకు చేరుకుంటున్నాయి. ప్లాస్టిక్ మహమ్మారి, కాలుష్య కారకాలతో పక్షులు కొన్ని పూర్తిస్థాయిలో అంతరించిపోయాయి. అదేవిధంగా అడవులను నరికి వేయడంతో కూడా తీవ్ర అనర్థాలు పక్షజాతులకు ఏర్పడుతున్నాయి. పక్షుల మనుగడకు నష్టం వాటిల్లడం వల్ల పరోక్షంగా మానవుల ఆరోగ్యం మానవుల మనుగడపై కూడా తీవ్ర ప్రభావం ఉంటుంది.

మనస్సుకు సంతృప్తికరం



మేము ఇద్దరం ఉద్యోగులం. మా ఆయన వ్యవసాయ విస్తరణ అధికారి. నేను టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాన. మాకు ప్రకృతిపై మమకారం ఎక్కువ. విధి నిర్వహణలో ఎంత బిజీగా ఉన్నా.. రోజూ కొంత సమయం పక్షులకు కేటాయిస్తాం. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువ అవుతుండడంతో పక్షులు దాహం, ఆకలి తీర్చడానికి ఇంటి ఆవరణలో బర్డ్ ఫీడర్ల ఏర్పాటు చేశాం. ఉదయం, సాయత్రం చల్లని నీటిని, ధాన్యపు గింజలను అందిస్తున్నాం. పక్షులకు ఆహారం అందించడం ద్వారా మనసుకు సంతృప్తిగా ఉంటుంది.

– ఎండపల్లి సుమలత–అశోక్ కుమార్, ఉద్యోగ దంపతులు, నిర్మల్

పక్షుల సవ్వడితోనే ఆహ్లాదం



ఇంటి ఆవరణలో పక్షులు, పిచ్చుకుల సవ్వడులతో మనసుకు ఆహ్లాదం కలుగుతుంది. ప్రస్తుతం ఎండల తీవ్రత పెరిగినందున పక్షులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఇందుకోసం రోజూకొద్ది సమయం కేటాయిస్తే చాలు.. కాసిన్ని నీరు, ధాన్యపు గింజలు వేస్తే పక్షులు ఆకలిని, దాహార్తి తీర్చుకుంటాయి. ఆ సంతృప్తి కూడా మనసుకు హాయినిస్తుంది. ఇలా ప్రతీరోజు ఉదయం, సాయంత్రం సమయం కేటాయించి పక్షులకోసం ఇలా చేయడం అభిరుచిగా మార్చుకున్నాను.

– బారె కృష్ణవేణి, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, ప్రియదర్శినినగర్, నిర్మల్

చిట్టి చేతులతో గట్టిమేలు



ఎండలకు పక్షులు చచ్చిపోతున్నాయి. వాటికి ఆహారం, నీళ్లు దొరకడం లేదు. అందుకే మావంతుగా ఇంటి ఆవరణలో చిన్న ప్లాస్టిక్ డబ్బాలో పక్షుల కోసం నీటిని పోసి ఉంచుతున్నాం. మధ్యాహ్నం వేళలో పక్షులు, పిచ్చుకలు మా ఇంటికి వస్తున్నాయి. నీటిని తాగి దప్పికను తీర్చుకుంటున్నాయి.

– ప్రహర్షరామ్, సుగంధిని, దివ్యనగర్

పక్షుల సంరక్షణపై అవగాహన



మాది ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రం. పక్షుల సంరక్షణ కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా. నీటి తొట్టెల ఏర్పాటు, బర్డ్ ఫీడర్ వంటివి ఏర్పాటు చేయడం వల్ల పక్షులకు ఒనగూరే ప్రయోజనాలను వివరిస్తున్నా. చిన్న చిన్న పనులే పక్షుల మనుగడకు తోడ్పడతాయి. అందుకే ద్విచక్రవాహనంపై ఉమ్మడిజిల్లాలోని పలు ప్రాంతాలను సందర్శిస్తూ పక్షుల సంరక్షణ కోసం సందేశాన్ని వినిపిస్తున్నా. సొంత ఖర్చుతో బర్డ్ ఫీడర్లు కొనుగోలు చేసి పంపిణీ చేస్తున్నా.

– జక్కుల వెంకటేశ్, ఆదిలాబాద్

‘బీజేపీవి ప్రజావ్యతిరేక విధానాలు’



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఖానాపూర్: పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉండి ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టీ శ్రీనివాస్ కోరారు. ఆదివారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంబిస్తూ ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్‌పరం చేస్తోందని ఆరోపించారు. రైతు వ్యతిరేక చట్టాలు, కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి తీవ్ర అన్యాయం చేస్తోందని విమర్శించారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వకపోవడంతో పాటు నోట్ల రద్దు, జీఎస్టీ వంటి విధానాలతో దేశంలోని ప్రజానీకాన్ని దుర్భర పరిస్థితుల్లోకి నెట్టిందని దుయ్యబట్టారు. న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జే రాజు, ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేశ్, నాయకులు మంచికంటి లక్ష్మణ్, వెంకటేశ్, దుర్గం లింగన్న, ప్రసాద్, శ్రీనివాస్ తదితరులున్నారు.

ప్రశాంతంగా టీఎస్‌ఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష



పరిశీలిస్తున్న ఆర్‌సీవో గంగాశంకర్

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల(టీఎస్‌ఆర్‌జేసీ)ల్లో 2024–25 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్షకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 5,506 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని 23 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 4,437 మంది హాజరయ్యారు. 1,069 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను టీఎస్‌ఆర్‌జేసీ రీజినల్ కో ఆర్డినేటర్ గంగాశంకర్ పరిశీలించారు. ఇందులో ప్రతిభ ఆధారంగా విద్యార్థుకు ఉమ్మడి జిల్లాలోని రెండు టీఎస్‌ఆర్‌జేసీ కళాశాలల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని బాలికల కళాశాలలో 88 సీట్లు, బెల్లంపల్లిలోని బాలుర కళాశాలలో 88 సీట్లు ఉన్నట్లుగా ఆర్‌సీవో వివరించారు.

కలకలం రేపుతున్న చిరుత సంచారం



చిరుతదాడిలో మృతిచెందిన లేగదూడ



లేగదూడ కళేబరాన్ని పరిశీలిస్తున్న బీట్ అధికారి

- వారంలోపే మరో లేగదూడపై దాడి
- భయాందోళనలో బెంబర వాసులు

తానూరు: వారంలోపే చిరుతపులి మరో లేగదూడపై దాడి చేసి చంపింది. వారం క్రితం బెంబర గ్రామానికి చెందిన లచ్చన్న లేగదూడను చిరుత చెట్టుపైకి తీసుకువెళ్లి దాడి చేసి చంపిన విషయం తెలిసిందే. ఈ ఘటన మరవకముందే శనివారం రాత్రి ఇదే గ్రామానికి చెందిన రైతు షేక్ మౌలామియ్యాకు చెందిన లేగదూడను చంపి తిన్నది. బాధితుడు మౌలామియ్యా తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో ఆవులతోపాటు లేగదూడను కట్టేసిన మౌలామియ్యా భోజనం చేసేందుకు ఇంటికి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి లేగదూడ కనిపించలేదు. గ్రామస్తులతో కలిసి రాత్రి లేగదూడ కోసం వెతికాడు. గ్రామ శివారులో లేగదూడ కళేబరం కనిపించింది. చిరుత దాడితోనే లేగదూడ మృతి చెందినట్లు గమనించిన బాధితుడు ఆదివారం అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చాడు. దీంతో బీట్ అధికారి మహేశ్ గ్రామానికి చేరుకుని లేగదూడను చిరుత హతమార్చినట్లు ధ్రువీకరించారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు.

భయాందోళనలో ప్రజలు

తానూరు మండలం బామ్ని, భోసి, మహలింగి, బామ్నితండా, బెంబర గ్రామాలు సరిహద్దు అటవీ ప్రాంతంలో ఉన్నాయి. వరుస చిరుత దాడులతో వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు రైతులు జంకుతున్నారు. వారంలోపే రెండు లేగదూడలను చిరుత హతమార్చడంతో భయాందోళనకు గురవుతున్నారు. విషయాన్ని పలుసార్లు అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఘటన జరిగినప్పుడే అధికారులు వచ్చి వెళ్తున్నారని, శాశ్వత చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని విమర్శిస్తున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

సరిహద్దులో చిరుత సంచరిస్తున్న మాట వాస్తవమే. వారంలో రెండు లేగదూడలను హతమార్చినట్లు ధ్రువీకరించాం. సరిహద్దు గ్రామాల రైతులు వ్యవసాయ పొలాలకు ఒంటరిగా వెళ్లరాదు. ఇద్దరు లేదా ముగ్గురు కలిసి పెద్ద శబ్దాలు చేసుకుంటూ వెళ్లాలి. చిరుత సంచరిస్తున్న విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

– మహేశ్, అటవీశాఖ బీట్ అధికారి

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు

- టాటా ఏస్, బొలెరో వాహనాలు ఎదురెదురుగా ఢీ
- దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ఆదిలాబాద్ జిల్లా సుంకిడి వద్ద ఘటన



ఘటనలో టాటా ఏస్, బోల్తాపడ్డ బొలెరో

తలమడుగు: దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలైన ఘటన తలమడుగు మండలం సుంకిడి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా సోమతానా గ్రామానికి చెందిన 16 మంది శనివారం ఉదయం టాటా ఏస్‌లో చంద్రాపూర్ జిల్లా మహంకాళి ఆలయ దర్శనానికి వెళ్లారు. దర్శనం అనంతరం తిరిగి రాత్రి స్వగ్రామానికి పయనమయ్యారు. ఈ క్రమంలో తెల్లవారుజామున తలమడుగు మండలం సుంకిడి గ్రామ సమీపంలో గల పెట్రోల్ పంపు వద్ద ఆదిలాబాద్ వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. టాటా ఏస్ డ్రైవర్ గాదె పాండురంగ్ అతివేగం, అజాగ్రత్తగా వాహనం నడపడంతోనే ప్రమాదం చోటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అందులో ఉన్న నలుగురికి తీవ్ర గాయాలవగా.. మిగతావారు స్వల్పంగా గాయపడ్డారు. బొలెరో వాహనం బోల్తా పడగా అందులోని డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు వెంటనే 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం వారంతా చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ధనశ్రీ తెలిపారు.

దుబాయ్‌లో మనోళ్లు భద్రమేనా!

- భారీవర్షాలతో గల్ఫ్‌దేశం అతలాకుతలం
- ఆందోళనలో గల్ఫ్ కార్మిక కుటుంబాలు
- సురక్షిత ప్రాంతాలకు వెళ్తున్న బాధితులు
- లైఫ్‌గార్డ్ బృందంలో నిర్మల్‌వాసి సందీప్



లోతట్టు ప్రాంతాల్లోని వరదనీటిలో చిక్కుకున్న వారిని బయటకు తెస్తున్న బృందంలో సందీప్



దుబాయ్‌లో నీటమునిగిన తెలుగువారుండే ఓ ప్రాంతం

నిర్మల్‌ఖిల్లా: దుబాయ్‌లోని పలు ప్రాంతాల్లో కొద్దిరోజులుగా భారీవర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపిలేని భారీ వర్షాలతో అక్కడిజనం అతలాకుతలమవుతున్నారు. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు, వీడియోలు వైరల్ అవుతుతున్నాయి. వాటిని చూస్తున్న గల్ఫ్ కార్మికుల కుటుంబీకులు ఆందోళన చెందుతున్నారు. నిర్మల్ జిల్లా నుంచి వేలసంఖ్యలో ఉపాధి కోసం గల్ఫ్‌దేశాలకు వెళ్లి జీవనం సాగిస్తున్నారు. దుబాయ్‌లో కుండపోత వర్షాల కారణంగా జనం సురక్షిత ప్రాంతాలకు వెళ్తున్నట్లు సమాచారం. దుబాయ్‌లోగల లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లు నీటమునిగాయి. దాదాపు ఆరడుగుల లోతున్న వరద నీటిలో ఇరుక్కుపోయిన వారిని పడవలు, బోట్లు, సహాయకబృందాల ద్వారా బయటకు తీసుకువస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు నిర్మల్ జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ వాసి పాతర్ల సందీప్ ‘సాక్షి’తో ఫోన్‌లో తెలిపారు. దుబాయ్ డీపీ– 1 గ్రీన్ కమ్యూనిటీలో లైఫ్‌గార్డ్‌గా విధులు నిర్వహిస్తున్న సందీప్ అక్కడి విపత్తు నిర్వహణాధికారుల ఆదేశాల మేరకు వరద నీటిలో చిక్కుకున్న లోతట్టు ప్రాంతాలవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధుల్లో ఉన్నట్లు పేర్కొన్నారు. మిగతా ప్రాంతాల్లోని కార్మికులను కూడా బృందాలుగా ఏర్పడిన లైఫ్‌గార్డ్స్ ప్రాణాలకు తెగించి నీటమునిగిన వారిని బయటకు తీస్తున్నట్లు వివరించారు. నాలుగురోజులుగా విపరీతంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించినట్లు వివరించారు.

ప్రశంసలు పొందుతున్న నిర్మల్ జిల్లావాసి..

నిర్మల్ జిల్లాకేంద్రానికి చెందిన పాతర్ల సందీప్ దుబాయ్‌లోని గ్రీన్ కమ్యూనిటీ ప్రాంతంలో లైఫ్‌గార్డ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో భాగంగా అక్కడిబృందంలో నిర్వహిస్తున్న విధులకుగాను అధికారులు ఇతడిని ప్రశంసిస్తున్నారు. జిల్లావాసులు కూడా అతడు అందిస్తున్న సేవలు తెలుసుకుని ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

‘మిసెస్ వరల్డ్’కు డాక్టర్ చంద్రిక



డాక్టర్ చంద్రిక

నిర్మల్: మిసెస్ వరల్డ్–ఇంటర్నేషనల్ ఫైనల్ పోటీలకు జిల్లాకేంద్రానికి చెందిన వైద్యురాలు చంద్రిక ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని తాజ్ డెక్కన్‌లో శనివారం నిర్వహించిన ఆడిషన్స్‌లో ఆమె పాల్గొన్నారు. ఇందులో సెల్ఫ్ ప్రజెంటేషన్, ఇంట్రడక్షన్, ఇంటర్వ్యూ తదితర రౌండ్లలో ప్రతిభ కనబర్చారు. ఈమేరకు హైదరాబాద్ నుంచి చేపట్టిన ఆడిషన్స్‌లో ఆమె ఫైనల్‌కు ఎంపికయ్యారు. గురుగ్రామ్‌లో జూన్ ఒకటిన ఫైనల్ పోటీలుంటాయని చంద్రిక తెలిపారు. నిర్మల్ నుంచి తాను ఇక్కడిదాకా రావడానికి తన భర్త డాక్టర్ అవినాష్, అత్తమ్మ దేవీబాయి సహకారమే కారణమని పేర్కొన్నారు.

పోలీసుల ఆంక్షలు... ప్రజలకు తిప్పలు



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం పోలీసులు అనుసరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ‘నా కోసం ట్రాఫిక్‌ను ఆపి ప్రజలను ఇబ్బందులు పెట్టవద్దని సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రేవంత్‌రెడ్డి పోలీసులకు ఆదేశాలు జారీచేసిన సంగతి తెలిసిందే. కాగా సీఎం రాక నేపథ్యంలో పోలీసులు భారీ కాన్వాయ్‌తో రిహార్సల్ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన చౌక్‌ల్లో ఆంక్షలు విధిస్తూ ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిపివేశారు. దీంతో సామాన్యులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. సీఎం రాకముందే తమను ఇలా ఇబ్బందులకు గురిచేయడమేంటని పలువురు చర్చించుకోవడం గమనార్హం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

